# సత్యమేవ జయతే

సత్యమునకు సరియైన మార్గము ఏది? నిజముగా ఈ మార్గమును ఎరిగిన వారెవరు? ఇప్పుడు దానిని ఎవరు తెలియచేయగలరు? (ఋగ్వేదము 3:54:5). మార్గము తెలియనివారు మార్గము తెలిసినవారిని అడిగి తెలుసుకుంటారు. తెలిసినవాని దగ్గర మార్గమును గూర్చి వివరంగా తెలిసికొని గమ్యము చేరుకుంటారు. ఇదే నిజముగా క్షేమకరమైన విధానం. ఈవిధముగా మార్గము తెలుసుకున్నవారు సరియైన మార్గములో ముందుకు సాగిపోగలరు (ఋగ్వేదము10:32:7). ఏ భేదమును లేదు. అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (బైబిలు- రోమా 3:23). పాపము చేసినందున మరణము (నరకము) అందరికిని సంప్రాప్తి అగును (రోమా 5:12). పాపమును పోగొట్టుకొని పవిత్రుడనైతిననుకొనతగిన వాడెవడు? (బైబిలు - సామెతలు 20:9). కామము, క్రోధము, లోభము అను ఈ మూడును మూడు విధములగు నరక ద్వారములు. ఇవి ఆత్మ నాశనము కలుగచేయును. కాబట్టి ఈ మూడింటిని విడనాడవలెను (భగవద్గీత 16:21).

**ఏది పాపము** : సకల దుర్నీతి పాపము (1 యోహాను 5:16). పాపము చేయు ప్రతి వాడును ఆజ్ఞను అతిక్రమించును. ఆజ్ఞాతిక్రమమే పాపము (1యోహాను 3:4) నీవు సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచియుండును (బైబిలు- ఆది 4:7). మేలైనది చేయనెరిగియు అలాగు చేయని వానికి పాపము కలుగును (యాకోబు 4:17). తన పొరుగువాని తిరస్కరించువాడు పాపము చేయువాడు (సామెతలు 14:21). మూర్ఖుని యోచన పాపము (సామెతలు 24:9). జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలగునవి పాపహేతువులు. ఇట్టి వాటిని చేయువారు దేవునిరాజ్యమును స్వతంత్రించుకొనరు (బైబిలు - గలతీ 5 :19-21).

**దేవుడు ఎవరు?** దేవునిగూర్చిన అనుభవము లేకుండగానే, దేవునిగూర్చి మాటలాడుచు ఆనందించేవాడు, నీటిలో ప్రతిబింబించుచున్న చెట్టుపండ్లను తినగోరు మూర్ఖునితో సమానుడు (మైత్రియోపనిషత్ 2 : 22). అనేక వేదములచే తెలియబడువాడును, వేదాంత ప్రవర్తకుడును, వేద వేద్యుడునైన దేవునకు పాపపుణ్యములు, జనన మరణములు మరియు దేహ ఇంద్రియములు లేవు (కైవల్యోపనిషత్). జన్మరహితుడు, శాశ్వతమైనవాడు, సకలప్రకృతితత్వముల వికారములనుండి ప్రత్యేకించబడి, పరిశుద్ధమైనవాడునగు, ఆ దేవుని సాక్షాత్కరించుకొనిన మానవుడు విముక్తి పొందుతాడు (శ్వేతాశ్వతరోపనిష్ 2 :15). "దేవుడు" అనగా సంస్కృత భాషలో "దివ్యతి ఇతిదేవః" అనగా ప్రకాశించువాడని అర్థము. కావున దేవుడు వెలుగైయున్నాడు. మరి ఆ వెలుగును చేరుటకు గల మార్గము ఏది?.

శ్లో॥ **"ఓం భూర్భువః స్వః తత్స వితుర్వ రేణ్యమ్-భర్గో దేవస్య ధీమహి, ధియో యోనః ప్రచోదయాత్ ॥** (గాయత్రీ మంత్రము)
దేవుడు సుఖ సంతోషములుగల సజీవుడు, శ్రేష్టమైన తేజస్సుచే ప్రకాశించుచు పాపములను నశింపచేయు దివ్య వెలుగు. ఆ దేవుని యొక్క దివ్య నామమును ధ్యానింతుము. ఆ దేవుడు మా బుద్ధులను ప్రేరేపించును గాక! ఆ తేజస్సును (వెలుగును) ఎల్లప్పడు ధ్యానింతుము"

శ్లో॥ **ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల ..................... శరణంబు వేడదన్.** (శ్రీ పోతన భాగవతం 8వ స్కందము 73వ శ్లోకము).
భా॥ ఈ సృష్టికి మూలమైన వాడెవ్వడో, ఆది మధ్య అంతములు లేని వాడెవ్వడో, సమస్తము తానే అయిన వాడెవ్వడో అట్టి స్వయంభువులైన ఆ పరమాత్మనే నేను శరణు వేడుచుంటిని.
పైనగల శ్లోకములలో ముక్కోటిదేవతలలో ఒక్కపేరైనను ఉదహరింపక తేజస్సుగల దివ్యనామమును ధ్యానింతుము అని ఉంది.

శ్లో॥ **కామక్రోధవ శాస్సర్వేదేవ ఋషి పిత్రు మానవాః**
భా॥ సమస్త దేవతలు, ఋషులు, పితృదేవతలు, మానవులు కామక్రోధము అనే దుర్గుణములు కలవారు.

శ్లో॥ **పాపోహం పాపకర్మః పాపాత్మ పాపసంభవః త్రాహిమాం-కృపాయ దేవ శరణాగత వత్సలా ।**
భా॥ జన్మకర్మ పాపినైన నన్ను నా పాపముల నుండి రక్షించుము దేవా

శ్లో॥ **మునమో బ్రహ్మాపుత్రాశ్చత ధాన్యేత పస్తోమాః । - తేపి గుణ త్రయా నిధ్ధాః కింపున ర్మాణ వాభువి॥** (దేవి భాగవతము)
భా॥ మునులు, బ్రహ్మపుత్రులును కామ, క్రోధ, లోభ, మోహ, మద మత్సర్యములను జయింపలేకపోయారు.

శో॥ **అసతోమా సద్గమయ తమసోమ జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ** (బృహదారణ్య కోపనిషత్)
భా॥ ఓదేవా! నన్ను అసత్యము నుండి సత్యములోనికి, చీకటి నుండి వెలుగులోనికి మరణము నుండి నిత్యజీవములోనికి నడిపింపుము.

జన్మ కర్మ పాపములకులోనై అజ్ఞాన అంధకారములో ఉన్న మానవుడు మోక్షం పొంది నిత్యజీవం (దేవుని) చేరుట ఎలా? మనం దేవుళ్ళని ఎవరినైతే పూజిస్తున్నామో వాళ్ళు కూడా మోక్షం కోసం తపస్సులు చేసినట్టుగా చూస్తున్నాము. వారే మోక్షంకోసం తపస్సులు చేస్తే అసలు మోక్షం ఇచ్చే వారెవరు? మనము నిత్యము సేవిస్తున్న దేవతామూర్తులు, అవతార పురుషులు అనబడుచున్నవారు అరిషడ్వర్గములను (కామక్రోధ ......) జయించలేకపోతిమి అని అష్టదశ పురాణములలో (ముఖ్యంగా బ్రహ్మవైవర్త) అనేక చోట్ల వ్రాయబడి ఉన్నది. ఒకరు గౌతముని భార్య అహల్య ప్రాతివత్యాన్ని మోసముతో చరిచి, మరొకరు జలంధరుని భార్యయగు తులసి (బృంద) తో సంగమించి, ఇంకొకరు కామముతో మోహిని రూపంలో ఉన్న పురుషుని వెంబడించినారు. ఇలా మరి ఎన్నెన్నో ........ **కామము, క్రోధము, భయము, మోహము, లోభము, మదము, రజోగుణము, జనన మరణము లేనివాడే శుభప్రదుడైన దేవుడు** (యోగశిఖోపనిషత్ 1:11). **భూమ్యాకాశములను కలుగచేసిన వాడు సమస్త ప్రాణికోటిని సృష్టించినవాడు. జనన, మరణము లేని ఆ సృష్టికర్తే నిజమైన దేవుడు** (ఋగ్వేదం 10వ మండలం 121 వ సూక్తం). **దేవుడు సర్వాంతర్యామి, స్వచ్ఛమైనవాడు నిర్మలుడు, శరీర స్వభావం లేనివాడు, పాపరహితుడు, పరిశుద్ధుడు, జ్ఞానవంతుడై సమస్త సృష్టిని సృజించిన స్వయంభవుడు.** (యజుర్వేదం 40:8). మేము దేవుళ్ళమని చెప్పకున్న వాళ్ళు, ఈనాడు చెప్పకుంటున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు. బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు సృష్టికర్తలుగా పిలువ బడుతున్నారు. అసలు సృష్టికర్త ఒక్కరే అయిఉండాలి. ఆయన ఎవరు? ఈ ముగ్గురిలో ఒకరా? లేక ఆయనవేరా? మనము దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టి కర్తకు బదులుగా సృష్టమును పూజిస్తున్నాము. **పరమాత్ముని విడచి కంటికి కనబడు సృష్టి పదార్థములను పూజించువారు ఘోర నరకమున పడుదురు** (ఈశావాస్యోపనిషత్ 12 వ శ్లోకం). **రాళ్ళతోను, లోహములతోను, మణులతోను, మట్టితోను చేయబడిన విగ్రహములను కాక తన హృదయమందలి పరమాత్మను పూజింపవలెను. మోక్షం చేరగోరువాడు బాహ్యమైన పూజలు విడువవలెను.**
(మైత్రేయోపనిషత్ 2:26)

పరమేశ్వరుడు కొయ్యలో, రాతిలోను, మట్టిలో నెక్కడలేడు భావములో నున్నాడు (గరుడపురాణం). దేవాలయములోని విగ్రహాలనే దేవునిగా భావించి మూఢులు సేవించి మ్రొక్కుచున్నారు. "విగ్రహమే దేవుడైనచో దానిని నిర్మించిన శిల్పి దేవాది దేవుడగును కదా"! రాళ్లతో గుడులు కట్టి రాతి విగ్రహములనుంచి పూజించనేల? రాళ్లను పూజించుట వలన ప్రయోజనం లేదు (వేమన పద్యరత్నాకరము). **విగ్రహపూజ, నామస్మరణ, తీర్థయాత్రలు, దానధర్మాల వలన మోక్షము రాదు** (దయానంద సరస్వతి - సత్యార్థ ప్రకాశం 11వ అధ్యాయం). **దేవునివిడిచిపెట్టి బాహ్యమైన విగ్రహములు (బొమ్మలు) ను సేవించు వాడు. తన చేతియందలి అన్నపుముద్దను వదిలి మోచేతిని నాకువాడగును** (ధర్మనోపనిషత్ 4:58) **చిత్తమందు అంతర్గతములైన మలినగుణములు కేవలము తీర్థస్నానము చేత తొలగనేరవు.** (దర్శనోపనిషత్) **స్నానము, సంధ్య, తీర్థయాత్రలు, దానధర్మములు వలన పాపము పోదు, మోక్షము రాదు** (మైత్రేయోపనిషత్). **సమస్త పాపముల నుండి మానవుడు విముక్తుడగుటకు, యజ్ఞమే తరుణోపాయం, యజ్ఞముచే పాపములు నశించబడును** (భగవద్గీత 3వ అధ్యాయము). **లోకమునకు యజ్ఞమే ముఖ్యాధారం** (ఋగ్వేదం 4:30). **యజ్ఞమే రక్షించుచున్నది. దాని యొక్క ఛాయయే అగుపడుచున్నది** (తాండీయ మహాబ్రహ్మణం)

శ్లో॥ **ప్రజాపతిర్దే వేభ్య ఆత్మానాం యజ్ఞంకృత్వా ప్రాయచ్ఛత్** (సామవేదం)

భా॥ ప్రజాపతి తనను తాను యజ్ఞముగా అర్పించుకొని ప్రాయశ్చిత్తము నెరవేర్చెను.

ఈ యజ్ఞమునకు ఛాయగా బైబిలు గ్రంధమునందు ఈవిధముగా ఉన్నది. లేఖనముల ప్రకారము "క్రీస్తు మన పాపముల నిమిత్తం మృతిపొందెను. సమాధిచేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ 15:3,4) తైత్తీయారణ్యకములో **ప్రపంచ సృష్టికర్త పురుషరూపమున తనను తాను బలిగా అర్పించుకొనుటయే ఈ యాగము రహస్యము** అని, శతపద బ్రహ్మణములో **భూతకోటి క్షేమమునకు గాను సృష్టికర్త తాను బలి పశువు అవ్వవలెను** అని వ్రాయబడియున్నది.

శ్లో॥ **సర్వపాప పరిహారో రక్త ప్రోక్షణమవశ్యం తద్రక్తం పరమాత్మేన పుణ్యదాన బలియాగం** (సామవేదం)

భా॥ సమస్త పాపములు పరిహరింపబడుటకు రక్తము అవసరము, ఆ రక్తము పరమాత్ముడు తనను తానే బలిగా అర్పించుకొనుట వలనైనది.

ఆ పరమాత్ముడు పుణ్యదాన బలియాగము ఎలా జరగాలో ఆ పద్ధతికి సమూనాగా అజామేధం అనే యజ్ఞం ఋగ్వేదము (బృహదారణ్యకోపనిషత్, ఐతరేయ బ్రహ్మణము మరియు శతపదబ్రహ్మణం) లో క్రింది విధంగా ఉన్నది. మచ్చలేని మేక కావలయును. దాని తలకు బలుసుకంప చుట్టి దానిని ఒక స్తంభమునకు కట్టి నాలుగు కాళ్లలో రక్తము కారునట్లు మేకులు కొట్టవలయును. మేకపై కప్పిన వస్త్రాన్ని నలుగురు ఋత్విజులు పంచుకొనవలయును. ఆ మేక ఎముకలలో ఒకటియైనను విరగకుండా దానిని గాయపరచి రక్తమంతా ఓడ్చాలి. ఆ మేక దప్పిగొనినప్పుడు సోమరసం ఇచ్చి అది చనిపోయిన తర్వాత తిరిగి ప్రాణప్రతిష్ఠ చేయవలెను. ఇటువంటి యజ్ఞము ఏనాటికైనా జరుగుతుందని అప్పడే సర్వమానవ పాపములు పరిహారం అవుతాయని ఆర్యఋషులు ప్రవచించారు.

అంతలో భూమండలానికి నడిబొడ్డు అయిన పాలస్తీనా దేశంలో ఒక అవతార పురుషుడు కన్యక గర్భాన జన్మించి "పాపములు క్షమించడానికి నాకు అధికారం కలదు. అనేకుల విమోచన కొరకు నా ప్రాణం అర్పించడానికి వచ్చాను". అని ఉపదేశం చేసిన ఆ మహాపురుషుని అజామేధంలో మేక వలె తలమీద ముండ్ల మకుటం, కాళ్ళు చేతులలో మేకులతో, సిలువ మీద వ్రేలాడతీసి, ఆయనకు కట్టిన వస్త్రములు పంచుకొని ప్రక్కలో బల్లెపుపోటుతో రక్తమంతా ఓడ్చి దాహంగొనినపుడు చేదు చిరక ఇచ్చి ఆయన చనిపోయినాడని నిర్ధారించి సమాధి చేసినారు. ఆయనే మూడవ దినమున తిరిగి లేచిన అవతార పురుషుడైన **"యేసుక్రీస్తు"**

**"నరకాత్ త్రాయిత ఇతి పుత్రః"** అనగా నరకము నుండి తప్పించు వాడు పుత్రుడు. **"కుత్సితాన్ మరయతి ఇతికుమారః"** అనగా దుర్గుణములను చంపువాడు కుమారుడు.

**ఈశ్ మూర్తి** ప్రాప్త నిత్య శుద్ధ శివాకారి - **ఈశ్ మసీహ్** ఇతిక్కమాం నామ ప్రతిష్ఠాతం. అనగా నిత్యుడు, పవిత్రుడు, దయా మూర్తి మరియు ముక్తి ప్రదాతయగు దేవుని స్వరూపము కలవాడు ప్రత్యక్ష పరచబడినవాడు. అతని పేరే **"యేసుక్రీస్తు" (భవిష్య పురాణం - భరత ఖండం ప్రతిసర్గ : 31 వ వచనం)**. సకలమైన అంధకారానికి అతీతమై, సూర్యకాంతితో వెలిగే ఆ మహాపురుషుని నేను దర్శనము చేసుకున్నాను. ఆయనను ప్రత్యక్షము చేసుకోవడము వలన మాత్రమే మానవుడు మరణము (నరకము) నుండి తప్పించుకోగలడు. నరకము నుండి విడుదల పొందుటకు ఆయన తప్ప మరొక మార్గం లేదు (శ్వేతాశ్వతరోపనిషత్తు 3 : 8). ఈ పురుషుడు నిజముగా మహా ప్రభువు, నియమించబడిన వాడు. ఆయనే శాశ్వతమైన వెలుగు పరిశుద్ధమైన మోక్షము అందుకునేటట్లు చేయుటకు గాను, ఆయన అందరి మనసులను త్రిప్పతాడు (శ్వేతాశ్వతరోపనిషత్తు 3 :12).

శ్లో॥ **అపుత్రస్యగతిర్నాస్తి స్వర్గోనైతి వచనైవచః** (బృహదారణ్యకోపనిషత్)

భా॥ కుమారుడు లేనిచో గతిలేదు, స్వర్గము కూడా లేదు. 'కు' అనగా పాపము 'మార' అనగా హరించువాడు.

కావున దేవుని కుమారుడు అను పాపరహితుడు తన్ను తానుగా బలి యాగమైనచో పాపములు పరిహరింపబడును. అట్టి యజ్ఞమే **"మోక్షమార్గము"**. అంతము లేనివాడు, సముద్రములపై నున్న వాడును, పాపములేనివాడును, వర్ణింప శక్యము కానివాడును, సుగుణ సంపన్నుడును, యువకుడునగు ఆ కుమారుని స్తుతించు (అధర్వణ వేదం 6 :1-2) . క్రీస్తుకు కొన్ని వందల సంవత్సరముల పూర్వమే ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్రాచీన మత గ్రంథములలో క్రీస్తు కోసం క్రింది విధంగా లేఖనములన్నవి.

1. భారతదేశ ఆర్యఋషుల ప్రవచనములు (క్రీపూ. 1500-1000 సం॥ల మధ్య)

శ్లో॥ **"అజాయమానో బహుధా విజాయతే తస్య యోనింపరి జానన్తి ధీరాః** (తైత్తిరియోపనిషత్)

భా॥ జన్మించని ప్రజాపతి జన్మిస్తాడు. దాని కారణం బుద్ధిమంతులు తెలుసుకొనవలెను.

శ్లో॥ **"హేతోరాది ఫలం ఏషామతీరేతు ఫలస్యచః తథా జన్మ భవిల్తేషా పుత్రాజన్మ పిత్రుస్యధః** (ఋ॥ ముండుకోపనిషత్)

భా॥ పరలోకమందున్న తండ్రి (సృష్టికర్తయైన దేవుడే) భూలోకములో పుత్ర రూపమున మానవునిగా జన్మించును.

శ్లో॥ **"ఆత్మావై పుత్రనామాసి" :** (బృహదారణ్యకోపనిషత్)

భా॥ దేవుని ఆత్మయే భూలోకంలో పుత్రునిగా జన్మించును .

శ్లో॥ **"లివ్యో గోప్తారం మహోక్యాదధిన్ - కుర్వంతి హవ్యాయానా పర్యతాసీన్॥** (సామవేదము)

భా॥ అవతరించబోవువాడు కన్యక గర్భము నందు జన్మించును.

శ్లో॥ **"ఈశ పుత్రంచ మాంవిర్ధి - కుమారి గర్భసంభవం - మ్లేచ్ఛ ధర్మస్య వక్తారం మసీహొ హం సమాగత:** (తాండియ బ్రాహ్మణం)
భా॥ దేవుని కుమారుడు కన్యక గర్భమున జన్మించి పాపులను నీతివంతులుగా చేయుటకు ప్రవక్తగాను, మెస్సీయగాను వచ్చును.
శ్లో॥ **"ప్రజాపతిశ్చరతి గర్భేత్వమేన ప్రతిజాయత్ తుచ్ఛం ప్రాణ ప్రజాస్థి మాబలిం హరంతేయః ప్రాణై ప్రతిష్టతిః"** (ఋగ్వేదము)
భా॥ ప్రజాపతియైన దేవుడు స్త్రీగర్భమున జన్మించి ప్రాణ ప్రతిష్టచేయబడిన వాడై మరణము నుండి తిరిగిలేచి పునరుత్థానుడు కావలెను. ఋగ్వేదము నందలి 10వ మండలములో ఉన్న పురుష సూక్తంలో **"విశ్వమానవాళి విమోచన కొరకు ప్రజాపతి పురుష రూపములో ఈ భూమి పై జన్మించి అపరాధిగా తీర్చబడి బలిపశువుగా అర్పణ అవ్వవలెను అప్పడే మానవాళికి రక్షణ"** అని వ్రాయబడిఉన్నది.

2. పారశీక మత ప్రవక్త ఆయన జోరాష్టర్ (క్రీపూ. 660సం॥) **"సృష్టికర్త భూమిపై అవతరించగా ఒక కొత్త తేజో నక్షత్రం ఆకాశమున కన్పిస్తుంది"** అని ప్రవచించెను. (జెండ్ అవెస్తా)
3. చైనా తత్వవేత్త అయిన కన్‌ఫ్యూషియన్ (క్రీ.పూ. 550 సం॥) **"మనకు పశ్చిమాన ఉన్న పాలిస్తీనాలో పరిశుద్ధుడు పుట్టనైయున్నాడని"** ప్రవచించెను.
4. గౌతమ బుద్ధుడు (క్రీపూ. 500 సం॥) **"ఐదు వందల సం॥ల తర్వాత మెతయా అను దివ్య పురుషుడు భూమధ్య పురమున అవతరిస్తాడని"** ప్రవచించెను. (ధిగానికాయా)
5. గ్రీకు తత్వవేత్త ప్లేటో (క్రీపూ. 429-347 సం॥) **"పరమాత్ముడు ధరలో అవతరించి పరలోకమునకు నరులు చేరేమార్గాన్ని ప్రభోధిస్తేనే గాని ముక్తి మార్గం లేదు"** అని ప్రవచించెను.

పై ప్రవచనాల నెరవేర్పు కొరకు ప్రాచీన కాల వివిధ దేశ ఋషులు ఎదురుచూస్తూనే ఉన్నారు. అలా కొన్ని వందల సం॥ల తర్వాత గాబ్రియేలను దేవదూత కన్య మరియతో "దయాప్రాప్తురాల నీకు శుభము ప్రభువు నీకు తోడైయున్నాడని, భయపడకుము దేవుని వలన నీవు కృప పొందితివి. ఇదిగో సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనెను. నీవు గర్భం ధరించి కుమారుని కని ఆయనకు **"యేసు"** అను పేరు పెట్టుదువు. ఆ శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడు అనబడును" (బైబిలు - లూకా 1:28-32) (దివ్య ఖురాన్, మర్యమ్ 18-21 ఆయత్, అత్ తహ్రీమ్ 12 అయత్) అని చెప్పెను.

ఆ ప్రకారము కన్య మరియ కుమారుని కన్నతర్వాత తూర్పుదేశపు జ్ఞానులు నక్షత్రము ద్వారా రక్షకుడైన కుమారుడు జన్మించాడని తెలుసుకొని పాలస్తీనా దేశపు బెత్లేహేము గ్రామములో కన్య మరియ గర్భమున జన్మించిన యేసును కనుగొని ఆయనను పూజించిరి (మత్తయి 2:1-12). యేసు బాప్తీస్మము పొందిన వెంటనే **"ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు ఈయన యందు నేనానందించుచున్నానని"** యొక శబ్దము ఆకాశము నుండి కల్గెను (మత్తయి 3:17). అంతేగాక దివ్య ఖురాన్‌లో ఆలీ ఇమ్రాన్ సురా 45-48 ఆయత్‌లలో యేసుని దేవుని వచనంగాను, నిసాసురా 171 వ ఆయత్‌లో దేవుని ఆత్మగాను ప్రస్తావించి, క్రీస్తు దేవుని దాసుడు, దైవ సందేశ హరుడు, పవిత్రమైన కన్యమేరి గర్భాన పుట్టిన దైవాత్మ స్వరూపుడు **(రూహుల్లాహ్)** దైవ ప్రవచన మూర్తి **(కలిమతుల్లాహ్)** అని ఉంది. ఆలీ ఇమ్రాన్ సుర 55 ఆయత్‌లో **"ఓయేసు నేనున్న స్థానములో నీ ఉండు లాగున నిన్ను హెచ్చిస్తాను"** అని దేవుడు చెప్పెను.

సర్వమానవ పాపముల పరిహారము కొరకు ప్రాచీన ఋషులు ప్రవచించినరీతిగా జన్మించిన ప్రవచన పురుషుడైన యేసుక్రీస్తు నాయందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచి ఉండకుండునట్లు నేను ఈ లోకమునకు వెలుగుగా వచ్చియున్నాను (యోహాను 12:46). నేనే మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు. (యోహాను 14:6). పాపములను క్షమించుటకు భూమి మీద మనుష్యకుమారునికి అధికారం కలదు (మత్తయి 9:6). అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా నా ప్రాణమును అర్పించటానికి వచ్చెను (మత్తయి 20:28). నేను ఈ లోకమునకు వెలుగును నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కల్గి ఉంటారని (యోహాను 8:12). బోధించి ఆయన తనకు తానుగా ప్రవచనముల ప్రకారము సిలువ బలియజ్ఞమునకు సిద్ధపడి మన పాపముల నిమిత్తం తన రక్తమును సిలువలో చిందించి మనకు పాపవిమోచన కలుగచేసెను. ఎన్నో మతాలను కల్గిఉన్న మన భారతదేశములో మహాపురుషులు, అవతారమూర్తులు అనబడిన వారెందరో పుట్టారు. వాళ్ళందరి చరిత్ర వారి జీవితకాలము ముగిసిన తర్వాతనే వ్రాయబడినది. కాని పైన పేర్కొనబడిన ప్రవచనాల ప్రకారము జన్మించి సర్వమత అంగీకారమైనట్టియు ఆ బలియాగం ద్వారా మానవాళి పాపపరిహార్థాం తనసొంత రక్తమును చిందించిన పరిశుద్ధుడు ఎవరును లేరు.

**రామకృష్ణపరమహంసకు ప్రత్యక్షమైన యేసుప్రభువు :** శంభుచరణ్ మాలిక్ అనే వ్యక్తి రామకృష్ణులకు బైబిలు చదివి వినిపించేవారు. తదుపరి యదు మాలిక్ ఉద్యాన గృహములో యేసుక్రీస్తు జీవిత చరిత్ర గురించి ఆయన చింతన చేస్తూ ఉండెడివారు. ఆ సమయములో ఒక దివ్య కాంతిపుంజం వచ్చి తన హృదయములో ప్రవేశించినది. ఫలితంగా తన దేవతామూర్తుల పట్ల ఆయనకున్న భక్తి ప్రేమలు అదృశ్యమైవాటి స్థానే క్రీస్తుపట్ల భక్తి విశ్వాసాలు ఏర్పడినవి. ఈ రీతిన మూడు రోజుల పాటు ఆ భావ తరంగాలు ఆయన మనసుపై ఆధిపత్యం చలాయించాయి. చివరకు మూడవ రోజు అంతర్‌వాణి ద్వారా **"దుఃఖ యాతనల నుండి జీవులను ఉద్ధరించడానికి ఎవరు తన హృదయ రక్తాన్ని సమర్పించారో ఆ మహా ప్రేమికుడే క్రీస్తు"** అనే పలుకు విన్నారు. (శ్రీ రామకృష్ణ చరితామృతం పేజి 115)

**యేసు ప్రభువును గూర్చి వివేకానందుని అభిప్రాయం** : **"నేను కూడా పాలస్తీనాలో క్రీస్తుతో కలిసి జీవించి ఉంటే ఆయన పాదాలను కన్నీటితో కాదు నా హృదయరుధిరముతో కడిగి ఉండేవాణ్ణి"** (స్వామి వివేకానంద జీవిత చరిత్ర (Vol. 2 పేజి 17). **"బ్రహ్మను తెలుసుకోలేం పరమ పితను మనం తెలుసుకోజాలం, పరమ పుత్రుణ్ణి మాత్రమే తెలుసుకోగలం. మానవ రూపములో క్రీస్తు మూలంగా మాత్రమే బ్రహ్మను కాంచగలం"** (స్వామి వివేకానంద - ప్రభోధరత్నాకరం మొదటి పేజి).

**యేసు ప్రభువును గూర్చి గాంధీజీ అభిప్రాయం** : "యేసుక్రీస్తు నా హృదయములో జొరబడి వసిస్తున్నారు, ఆయన ప్రభావం నా జీవితంలో చాలా కనిపిస్తుంది. యేసు క్రీస్తు మహా ప్రవక్త అని అనేక సార్లు చెప్పాను .......పర్వతము పైన యేసుప్రభువు చేసిన ఉపన్యాసము సుస్పష్టముగా హత్తుకు పోయేటట్లు వుంటుంది. యేసుక్రీస్తు త్యాగధర్మాన్ని ఆశ్చర్యంగొలిపే భాషలో ప్రబోధిస్తాడు. ఈ ప్రబోధం నాకు అపారమైన ఆనందమును కలుగజేస్తుంది - గాంధీ దర్శనము-సంకలనము, (అనువాదము : శ్రీ ఉప్పుటూరి వెంకట సుబ్బారావు).

**పురాతన క్రైస్తవేతర చరిత్ర కారుల అభిప్రాయము** : జోసిఫస్ (యూద చరిత్రకారుడు), లూసియస్ (గ్రీకు చరిత్ర కారుడు), టాసిటస్ (రోమా చరిత్రకారుడు) మరియు ప్లెయినీ (రోమా గవర్నర్) మొదలైన ప్రముఖులు ఏసును గూర్చి అనేక వివరములు ఆయా కాలములలో (క్రీ.శ. 52-112) ఆయనను చూచిన వ్యక్తుల ద్వారాను మరియు టాల్ముండ్ వ్రాత ప్రతుల ద్వారా అనేక విషయములు సేకరించి ఏసును ఎన్నెన్నో అద్భుతములు, ఆశ్చర్యకార్యాలు చేసిన శక్తి వంతమైన గౌరవించ తగిన భోధకుడు అని గుర్తించారు. ఆయన జ్ఞాని అని తెలుసుకొన్నారు. ఏసు సిలువ మరణం పస్కాపండగలో పొంతుపిలాతు ఆధ్వర్యంలో జరిగినదని చెప్పి, ఆయన మరణమును జయించి పునరుత్థానము జరిగినందున ఈ ప్రాంత ప్రజలు ఏసును క్రీస్తు (అభిషిక్తుడు) గాను, మెస్సయ్య (రక్షకుడు) గాను నమ్ముచున్నారు. క్రైస్తవులు ఏసును దేవునిగా ఆరాధించుట గుర్తించాము.

**హదీసులలో యేసు రెండవ రాకడను గూర్చి ........**

నా (మహ్మద్ ప్రవక్త) ఆత్మ ఎవరి చేతిలో ఉందో, ఆ దేవుని పేరట చెప్ప చున్నాను. మరియు కుమారుడైన యేసు నీతి మంతుడైన న్యాయాధిపతిగా మీ మధ్యకు దిగి వస్తారు (Ibid-Hadith No.1018). దేవుడు నా (మహ్మద్ ప్రవక్త) ఆయుష్షును పొడిగిస్తే యేసు తిరిగి వచ్చినపుడు ఆయనను కలసుకోవాలని నిరీక్షిస్తున్నాను. ఒక వేళ మరణము నన్ను తీసుకొని పోతే, ఆయనను కలసు కొనిన వాళ్ళలో మీలో ఎవరున్ననూ యేసుకు నా నమస్కారములు తెలియచేయండి (Al Hendy, Kanzol Ummal Vol. 17: 1034). రెండవ సారి యేసు వచ్చినపుడు - సాతానుడు యేసుని చూడగానే - అగ్ని దగ్గర మైనము కరిగి పోవునట్లు సాతానుడు కరిగి పోతాడు (Al Hendy Vol 18 - Hadith No. 812).

**బైబిలును ధృవీకరించిన ఖురాన్**

గ్రంధ ప్రజలారా! (యూదులు మరియు క్రైస్తవులు) మేము ఇప్పడు అవతరింప చేసిన గ్రంధాన్ని విశ్వసించండి. అది మీ వద్ద పూర్వం నుండి ఉన్న గ్రంధాన్ని (బైబిల్) ధృవపరుస్తుంది, సమర్ధిస్తుంది (సుర : 4-47, 2-42,89,92,97). ప్రవక్తా! గ్రంధ ప్రజలతో (యూదులు, క్రైస్తవులు) వాదించకు, వారితో ఇలా అను "మేము మా వద్దకు పంపబడిన దానిని విశ్వసించాము, మీ వద్దకు పంపబడిన దానిని విశ్వసించాము. మా దేవుడూ, మీ దేవుడూ ఒక్కడే! మేము ఆయనకే విధేయులం" (సుర : 29-46). ఖురాన్ మునుపు అవతరించిన గ్రంధాలను ధృవపరుస్తుంది. దీనికి పూర్వం ఆయన మానవులకు ఋజుమార్గం చూపటానికి, తౌరతు, ఇన్‌జీలు గ్రంధాలను (పాత మరియు క్రొత్త నింబంధనలు), ఇంకా సత్యాసత్యాలను వేరుచేసి చూపే గీటురాయిని అవతరింపచేసాడు (సుర : 3-3, 4-136, 17-2).

మన పాపములు మనము ఒప్పకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును. నీతి మంతుడును కనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులుగా చేయును (1 యోహాను 1:9). దేవుడు మనకు నిత్య జీవం దయచేసెను. ఈ జీవం ఆయన కుమారుని యందు ఉన్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము కలవాడు (1 యోహాను 5:11). కాబట్టి విశ్వాసము మూలముగా మనము నీతి మంతులుగా తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానం కల్గి యుందుము (రోమా 5:1) మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీకు తోడైయుండును గాక! (రోమా 16:24)

**విగ్రహారాధనపై ప్రముఖుల అభిప్రాయాలు** : అజ్ఞానికి గుడిలో దేవుడు ఉంటాడు. జ్ఞానికి విశ్వమంతా వ్యాపించి ఉంటాడు (**సర్వేపల్లి రాధాకృష్ణ**). విగ్రహారాధన ఎంతో హాస్యాస్పదమైనది, వ్యర్ధమైనది, నాడు ఒక వర్గమునకు గల వినాశకరమైన జ్ఞానం ద్వారా ఏర్పడినది (**గౌతమబుద్ధుడు**). వారు వ్రాసిన పుస్తకములలో యితరుల భావ స్వాతంత్ర్యాన్ని హరించి శూద్రులకు ఏ హక్కులు లేకుండా చేశారు (**స్వామి వివేకానంద**). విగ్రహారాధన వలన ఒక్క మతాచార్యులకు తప్ప వేరెవరికి ఏవిధమైన లాభం లేదు (**కందుకూరి వీరేశలింగం**). గౌతమ బుద్ధునిని బౌద్ధులు, మహమద్ ప్రవక్తను మహమ్మదీయులు, క్రీస్తు యేసును క్రైస్తవులు అనుసరించుచుండగా మరి హిందువులు ఎవరిని ఆరాధించాలి? వారి మత గ్రంథములు అనేకములు అవి ఒకదానితో మరొకటి విభేధించుచున్నవి. వాటిలో ఏది ప్రామాణికం (**బి.ఆర్. అంబేద్కర్**). మనిషి చేసిన రాయి, రప్పకి మహిమ కలదని సాగి మ్రొక్కుతూ మనుష్యులను రాయి రప్పలకన్నా కనిష్ఠంగా చూస్తావేల? (**మహాకవి గురజాడ**). క్రైస్తవులకు బైబిలు, మహమ్మదీయులకు ఖురాన్ లాగ హిందువులకు ఒకే మత గ్రంథము లేదు. శూద్రులకు అసలు మతమంటే ఏదో తెలియదు. ఆజ్ఞానంలో ఉన్న వీరు రాతి విగ్రహాలను నమ్మి పూజిస్తున్నారు. మానవ సంబంధాలు కుల, మత దేశానికి అతీతంగా ఉండాలి. మానవులు అంతా ఒకే దేవుని పూజిస్తూ ఐకమత్యంగా ఉండాలి (**మహాత్మా జోతిరావు పూలే**). కొండరాళ్ళు తీసుకువచ్చి వాటికి ముక్కు, మొహం, కాళ్ళు, చేతులు చెక్కి ఆ రాతి విగ్రహాలే దేవుళ్ళు అని పడి, పడి మ్రొక్కే మూర్ఖ శిఖామణులను ఏమనాలి? (**యోగి వేమన**). బ్రహ్మ పురాణాంలో బ్రహ్మచేతను, విష్ణుపురాణంలో విష్ణుచేతను, శివ పురాణంలో శివుని చేతను దేవి పురాణంలో దేవి చేతను సృష్టిని సృజించినట్లు రాసియున్నారు. జగత్ యొక్క సృష్టికి , స్థితికి, లయకు కర్తయైన వాడు ఎట్లు పుట్టును? పుట్టినవారు సృష్టికర్త ఎట్లు కాగలడు? పరస్పర విరుద్ధమైన వృత్తాంతములు పురాణములలో కలవు. కావున పురాణ గ్రంథములు ప్రామాణికమైన దైవోక్తులు కావు (**మహర్షి దయానంద సరస్వతి**). భారత ఆర్యుల కాలంలో వారు జరిపిన దండయాత్రలు, వారిలో వారికి జరిగిన యుద్ధాల్ని గూర్చి రామాయణం, భారతం వివరిస్తాయి. ఇవి నిజంగా జరిగాయని నేనెప్పడూ (**నెహ్రూ**) వాటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వాటిలో ఉన్న మంత్రాలు, మహిమల్ని గూర్చి విమర్శించాను కూడా, ఊహించి కల్పించి రాసిన అరేబియన్ నైట్స్ లేక పంచతంత్రలాంటి కథలవి (**జవహర్‌లాల్ నెహ్రూ** - డిస్‌కవరీ ఆఫ్ ఇండియా పేజి. 75,76) . నేడు మనమే రాముని గుణగానము చేయవలసి యున్నచో ఆ రాముడు వాల్మీకి యొక్క రాముడు కాడు, (**తులసీదాసు** రచించిన) తులసీ రామాయణములోని రాముడు కాదు...... నేను చెప్పచున్న రాముడు-దశరథ పుత్రుడును, సీతాపతియునగు రాముడు కాదు, నా రాముడు దేహదారి కాదు. మేము దేహదారియగు రాముని పూజించుట లేదు. మేము నిరంజనుడును, నిరాకరుడునునగు రాముని (సర్వేశ్వరుని) పూజించుచున్నాము (**మహాత్మాగాంధీ** - 1930 వ సం॥ అక్టోబర్ నెల నవజీవన్ పత్రిక). పారం పర్యాచారాలు, విగ్రహారాధన మొదలైనవి మన సనాతన ధర్మం, సంస్కృతికి ప్రతీకలని చాటే వారు, భారత ప్రజలు 6 జాతులు, 9 ఉపశాఖలు, 5 భాషా కుటుంబాల కలయిక వలన రూపుదిద్ధబడినవారు అని గమనించాలి. ఆర్యయజ్ఞం, అనార్య (ద్రవిడ) విగ్రహారాధన మిళితమై నిగమ, ఆగమ ఆచారాలు ఏర్పడినవి. ఎంత చెప్పకున్నా ఇది మాధర్మం అని ప్రామాణికంగా చెప్పేవారు లేరు. పీఠాధిపతులు, ఆచార్యుల బోధనలు, పరస్పరం విరుద్ధంగానే ఉంటాయి. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని గౌతమ బుద్ధుని, వేదమే శిరోధార్యంగా ఉన్న హైందవ ఆచారములలో భాగమైన అవతారములలో ఒక అవతారంగా చేశారు.

**నేటి తీర్మానమే నీ ఆత్మయొక్క నిత్యత్వాన్ని నిర్ణయిస్తుంది సుమా!**

సంకలనము : **సబ్బెళ్ళ సత్యనారాయణ రెడ్డి**